క్లుప్తంగా

ఘనంగా మంగళగౌరీ వ్రతం



పూజలు చేస్తున్న మహిళలు

కుంటాల: శ్రావణమాసం పురస్కరించుకొని మండలకేంద్రంలోని ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో మంగళవారం ఘనంగా మంగళ గౌరీవ్రతం మహిళలు ఆచరించారు. అర్చకులు శ్రీకాంత్ రామానుజ దాస్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడెం: మండలకేంద్రంలోని కేజీబీవీలో అసిస్టెంట్ కుక్‌గా పని చేసేందుకు అర్హత కల్గిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌వో విమల పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత కలిగి 360 మంది విద్యార్థులకు వంట చేసేందుకు అనుభవం కల్గి ఉండాలన్నారు. ఆసక్తి కల్గినవారు కడెం ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

బ్యాగ్, బంగారం అప్పగింత

నిర్మల్‌టౌన్: బస్సులో దొరికిన ప్రయాణికుడి బ్యాగుని అప్పగించి ఓ కండక్టర్ నిజాయితీ చాటుకున్నాడు. మంగళవారం నిజామాబాద్ నుంచి నిర్మల్ వస్తున్న ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు తన బ్యాగును మరిచిపోయి నిర్మల్‌లో దిగి వెళ్లిపోయాడు. బ్యాగును గమనించిన కండక్టర్ విలాస్ డిపో లో అప్పగించాడు. ఆ బ్యాగును డిపో మేనేజర్ పండరి తెరిచి చూడగా ఏడు గ్రాముల బంగారు చైను, ఫోన్, ఆధార్, పాన్ కార్డులు ఉన్నాయి. ఆధార్‌పై ఉన్న మొబైల్ నంబర్ ఆధారంగా సదరు వ్యక్తికి ఫోన్ చేసి బస్టాండ్ రప్పించి బ్యాగు అప్పగించారు.

నీటి సమస్య పరిష్కరించిన మాజీ కౌన్సిలర్

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు పరిధి కరీం కాలనీలో తాగునీటి సమస్యను కాలనీవాసులు తాజా మాజీ కౌన్సిలర్ పరిమిలత సురేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు రూ.16 వేలతో పైప్‌లైన్, వైరు, స్టాటర్ ఏర్పాటు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో వాసేఖాన్, ఫిరోజ్, హమీర్, సిబ్బంది ఉన్నారు.

కార్మికుడికి తప్పిన ముప్పు

కుభీర్: మండలకేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికుడు అంబాదాస్.. తోటి కార్మికులతో కలిసి కొత్త కాలనీలో బోరుబావికి మరమ్మతులు చేస్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అప్పుడే కరెంట్ నిలిచిపోవడంతో గాయపడ్డాడు. వెంటనే సిబ్బంది కుభీర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం భైంసాకు తరలించారు. ప్రస్తుతం ఆయన క్షేమంగానే ఉన్నట్లు పలువురు తెలిపారు.

వరిపంట పరిశీలన

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామ శివారులోని వరి పొలాలను మంగళవారం మండల వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ రైతులతో కలిసి పరిశీలించారు. నాటు వేసిన నెల రోజుల్లోపు మొగి పురుగు ఆశించి దిగుబడులను దెబ్బతిస్తుందని ఆయన పేర్కొన్నారు. దీని నివారణకు సూచనలు చేశారు. ఏఈఓ ఉమామహేశ్వరి, రైతులు దిలీప్, మల్లయ్య, సా యన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా సునీత

దస్తురాబాద్: మండలానికి నూతన ఎంపీడీవోగా సునీత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో ఖానాపూర్ ఎంపీడీవోగా పనిచేయగా.. ఇక్కడ పనిచేసిన రమేశ్ పెంబికి బదిలీపై వెళ్లారు. ఎంపీవో రమేశ్‌రెడ్డి, సూపరిటెండెంట్ గోపాలకిషన్ ఉన్నారు.

మత్తు దుష్పరిణామాలపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కుభీర్: మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై కుభీర్‌లో మంగళవారం మత్తు ప్రపంచ మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఆ సంఘం రాష్ట్ర ప్రతినిధి పండరి, హెచ్ఎం గంగాధర్, లక్ష్మణ్‌రావు, నాగేశ్ ఉన్నారు.

పథకాలు అందించాలి

ఖానాపూర్: లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను అందించాలని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇళ్లు నిర్మించే మేస్త్రీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వయోజనుల్లో అక్షరాస్యత పెంచేందుకు ఉల్లాస్ కార్యక్రమం అమలు చే యాలన్నారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్, ఎంఈవో సంధ్యారాణి, హౌ జింగ్ ఏఈ ఖయ్యూమ్, ఎంపీవో రత్నాకర్‌రావు ఉన్నారు.

మళ్లీ గుప్పుమంటున్న గుడుంబా

- గ్రామాల్లో తగ్గని అమ్మకాలు
- పోలీసులు చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



పాన్కల్ సమీపంలో వీడీసీ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్న గుడుంబా పాకెట్లు

మామడ: మండలంలోని గ్రామాల్లో గుడుంబా అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. వెంకటపూర్, నల్దుర్తి, కమల్‌కోట్‌తండా తదితర గోదావరి సమీపంలోని గ్రామాల్లో గుడుంబాను తయారీ చేస్తున్నారు. మంగళవారం మండలంలోని పాన్కల్ గ్రామ సమీపంలో గుడుంబాను విక్రయిస్తున్నారని తెలిసి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో యువకులు అక్కడికి వెళ్లారు. వీరి రాకను గమనించి గుడుంబాను విక్రయించే వారు అక్కడి నుంచి పరారయ్యారు. దాదాపు 40 లీటర్ల గుడుంబా ప్యాకెట్లను ధ్వంసం చేశారు. గతంలో గుడుంబా తయారీదారులకు ఇతర వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించడంతో విక్రయాలు తగ్గుముఖం పట్టగా.. ఇప్పుడు మళ్లీ జోరుగా సాగుతున్నాయి. గుడుంబా తయారీతోపాటు విక్రయిస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులంతా సంఘటితంగా ఉండాలి

- ఎమ్మెల్యే రామారావు పటేల్
- బ్రహ్మాన్‌గాంలో లిఫ్ట్ మరమ్మతులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావ్‌పటేల్

తానూరు(ముధోల్): రాజకీయాలకు అతీతంగా రైతులంతా సంఘటితంగా ఉండి లిఫ్ట్ ఇరిగేషన్ల (ఎత్తిపోతలు)ను కాపాడుకొని రెండు పంటలు పండించుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం రూ.5.80 కోట్లతో ముధోల్ మండలంలోని బ్రహ్మాన్‌గాం లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ లిఫ్ట్ ద్వారా బ్రహ్మాన్‌గాం, కిర్గుల్(కె), కిర్గుల్(బి) గన్నోరా తదితర గ్రామాల్లో ఆరు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. గోదావరి జలాలను సాగుభూములకు అందించాలన్నదే తమ సంకల్పమన్నారు. గతంలో బాసర లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కేవలం 250 ఎకరాలకే సాగునీరు అందేదని.. రూ.1.30 కోట్లతో మోటార్లకు మరమ్మతులు చేయించడంతో 1700 ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక రాజురా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీటిని అందిస్తున్నట్లు గుర్తు చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన 28వ ప్యాకేజ్ పనులు పూర్తయితే ముధోల్, తానూరు, కుభీర్ మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. కౌటా గ్రామంలో సబ్‌స్టేషన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'ఓర్వలేకనే విమర్శలు'

ఖానాపూర్: జనహిత పాదయాత్రకు వచ్చిన ప్రజాదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఎంఏ మాజిద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తోట సత్యం, అంకం రాజేందర్, గంగనర్సయ్య, కావలి సంతోష్, షబ్బీర్ పాషా, శంకర్, శేషాద్రి, శ్రీహరి, నయీం పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

లక్ష్మణచాంద: వ్యాయామం చేసి పౌష్టికాహా రం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిజాం ఇనిస్టిట్యూట్ ఆ ధ్వర్యంలో ఉపాధ్యా యుల సమావేశంలో ఆ యన మాట్లాడారు. ఆండ్రాయిడ్ ఫోన్ల అనర్థాలను, రేడియేషన్ ముప్పును వివరించారు. అనంతరం ఉపాధ్యాయుల కు పరికరాలు అందించారు. హెచ్ఎం రాజు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రుణాలు

లోకేశ్వరం: ప్రభుత్వ రుణాలు సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని అబ్దుల్లాపూర్, కన్కపూర్ గ్రామాల్లో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం(పీఎంఎంఎస్‌వై)పై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులకు మత్స్య వ్యవసాయానికి ఆర్థికసాయం, వలలు, ట్రాలర్ల కోసం అందించే బ్యాంకు రుణాలను వివరించారు. అబ్దుల్లాపూర్ ఎస్‌బీఐ సిబ్బంది ఉన్నారు.

ముర్రుపాలతో శక్తి

లక్ష్మణచాంద: బిడ్డ పుట్టిన తొలి మూడు రోజులు తల్లి పట్టే పాలే ముర్రుపాలని.. ముర్రుపాలతో శిశువుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఏఎన్ఎం వనజ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మునిపెల్లి, చామన్‌పెల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు గోలి సుజాత, గురాల ఇందిర, ఎన్‌టీ గంగామణి, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ శ్యామల అన్నారు. పట్టణంలోని బర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

ముందస్తు రాఖీ వేడుకలు

ఖానాపూర్: పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని రెండో వార్డు మాజీ కౌన్సిలర్ కారింగుల సంకీర్తన, మహిళలు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, పలువురు నాయకులకు రాఖీలు కట్టారు. రాజు, సుమన్, చంద్రహాస్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

నానో యూరియాతో దిగుబడులు

లోకేశ్వరం: రైతులు నానో యూరియా వినియోగిస్తే భూమి సారవంతంగా ఉండి అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి గిరిరాజ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో రైతులకు నానో యూరియా, డీఏపీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



నియామకపత్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్

భైంసాటౌన్: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ సూచించారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో నూతన సేవాదళ్ అధ్యక్షులకు నియామకపత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను విస్మరించొద్దని ఆయన సూచించారు. ముధోల్ నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు కదం ఆత్మరామ్, భైంసా మండల అధ్యక్షుడు అనిల్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయినాథ్, షేక్ మౌలా, కార్యదర్శి పోశెట్టి, కుభీర్, ముధోల్, లోకేశ్వరం, తానూరు, కుంటాల మండలాధ్యక్షులు విజయ్, అనిల్, దాసరి గంగాధర్, అమృత్ పటేల్, తదితరులకు నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మైనార్టీ ఇన్‌చార్జి లతీఫ్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, కాంబ్లే సాహెబ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి తరలిరావాలి

ఖానాపూర్/పెంబి: ఖానాపూర్‌లో ఈనెల 9న నిర్వహించే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని రాజ్‌గోండు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, జిల్లా నాయకుడు భీంరావు కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో మాట్లాడారు. ఆదివాసీలు, ప్రజాసంఘాల నాయకులు తరలిరావాలని కోరారు. సమావేశంలో గంగారాం, భీంరావు, పరుశురాం, గోవింద్, రోహిదాస్ పాల్గొన్నారు. పెంబిలో నిర్వహించే వేడుకలకు ఆదివాసీలు తరలిరావాలని రాజ్‌గోండ్ సేవా సమితి పెంబి మండలాధ్యక్షుడు గేడెం అశోక్ పేర్కొన్నారు.

వ్యాధులను నియంత్రించండి

భైంసాటౌన్: దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆకాశ్ సూచించారు. పట్టణంలోని ఏరియాస్పత్రిలోని తన కార్యాలయంలో మంగళవారం లెప్రా సంస్థ ప్రతినిధులతో కలిసి ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటుతో వచ్చే మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, అలాగే నులిపురుగుల నివారణ, కుష్టు వ్యాధి, తదితర వ్యాధుల నియంత్రణపై వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం గంగన్న, సీహెచ్ఓ ఫహీమున్నిసా, నోడల్ అధికారి లక్ష్మి, లెప్రసి సొసైటీ ప్రతినిధులు కిషన్ రావు, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ



నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న ప్రియాంక

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గ్రామానికే చెందిన దాడోల్ల ప్రియాంక రూ.10వేల నోట్‌బుక్‌లను అందించారు. ప్రియాంక తన తండ్రి భోజన్న(టీచర్) జ్ఞాపకార్థం 80 మంది విద్యార్థులకు నోట్‌బుక్‌లు అందించారు. హెచ్ఎంలు రాజన్న, మానస, సుమలత, గీత, గ్రామస్తులు గోపి, శ్రీధర్, మహేందర్, నిఖిల్, భూషన్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం గురుకుల, నవోదయ స్టడీ మెటీరియల్ అందించారు. పది మంది విద్యార్థులకు రూ.5వేలు విలువైన స్టడీ మెటీరియల్‌ను వానల్‌పాడ్ ఏఈవో లక్ష్మి–ఉపాధ్యాయుడు ఎల్లన్న (వానల్‌పాడ్ ప్రాథమిక పాఠశాల) దంపతులు అందజేశారు. ఉపాధ్యాయులు వసంత, శ్యామల తదితరులు ఉన్నారు.

భజరంగ్‌దళ్ విద్యార్థి ప్రముఖ్‌గా రాజశేఖర్

ఖానాపూర్: భజరంగ్‌దళ్ జిల్లా విద్యార్థి ప్రముఖ్‌గా ఖానాపూర్ పట్టణానికి చెందిన తంగళ్లపెల్లి రాజశేఖర్ నియమితులయ్యారని విశ్వహిందూ పరిషత్ ప్రాంత సహ కార్యదర్శి వెంకన్న తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో జరిగిన సమావేశంలో రాజశేఖర్‌కు బాధ్యతలు ప్రకటించినట్లు పేర్కొన్నారు. విభాగ్ కార్యదర్శి కృష్ణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు విఠల్, జిల్లా సంయోజక్ ప్రణయ్ తదితరులు ఉన్నారు.

వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడిగా పార్థసారధి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడిగా మండలోజు పార్థసారధి, జిల్లా ఉపాధ్యక్షుడిగా ముప్పిడి రవి, జిల్లా సత్సంగ్ ప్రముఖ్‌గా సాధం ఆనంద్, కోశాధికారిగా గజవాడ కృపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్ తెలిపారు.

రేషన్‌కార్డులు పంపిణీ

కుభీర్: మండలంలోని నిగ్వా గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు 60 మంది లబ్ధిదారులకు రేషన్‌కార్డు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. రఘురాం పటేల్, జాడే శ్రీనివాస్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్‌లో కొత్త రేషన్ కార్డు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఏఎంసీ డైరెక్టర్, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

'నిబంధలకు విరుద్ధంగా సర్దుబాటు ప్రక్రియ'

ఖానాపూర్: డీఈవో నియమించిన ఐదుగురు కమిటీ సభ్యులు జిల్లాలో జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను నిబంధనలకు విరుద్ధంగా చేపట్టడం సరికాదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జి ల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని.. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వి చారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు.

ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

ఖానాపూర్:పట్టణంలోని గ్రోమోర్ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని మంగళవారం మండల ప్రత్యేక అధికారి జీవరత్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ సుజాత, మండల వ్యవసాయ అధికారి జగదీశ్వర్‌తో కలిసి దుకాణంలో నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అంతకుముందు మండలంలోని సేవ్యానాయక్ తండా, సత్తనపల్లి గ్రామాల్లో డ్రై కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు

మామడ: మండలంలోని పొన్కల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థుల హాజరు పెంచేందుకు ఉపాధ్యాయులు వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నారు. ప్రతి నెలలో విద్యార్థుల హాజరు పరిశీలించి వందశాతం హాజరైన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్నారు. జూలై మాసంలో పాఠశాలకు వందశాతం హాజరైన 30 విద్యార్థులకు మంగళవారం బహుమతులను అందించి కాంపెక్స్ ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌కుమార్, పీఎస్ హెచ్ఎం శారద, తదితరులు అభినందించారు.

శుభ్రత పాటించాలి

తానూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో నసీరొద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం డ్రై డేలో భాగంగా మండలంలోని సింగన్‌గాం గ్రామంలో పరిసరాలు పరిశీలించారు. వర్షపునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించా రు. సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలుఉన్నారు.

కుంటాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీవో రహీంఖాన్ పేర్కొన్నారు. మంగళవారం డ్రైడే సందర్భంగా కుంటాలలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యదర్శి రాజబాపు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో జీపీ కార్యాలయం



హాలులో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యాలయం

కుంటాల: అద్దె భవనంలో కొనసాగుతున్న మండలంలోని మెదన్‌పూర్ పంచాయతీ కార్యాలయాన్ని నిబంధనలకు విరుద్ధంగా అంగన్‌వాడీ కేంద్ర భవనంలోకి ఏర్పాటు చేశారు. రూర్బన్ పథకం కింద గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం కోసం రూ.20 లక్షలతో భవనం నిర్మించారు. కాంట్రాక్టర్ నెల కిందట భవనాన్ని అధికారులకు అప్పగించారు. నాలుగు గదులున్న అంగన్‌వాడీ కేంద్ర భవనంలో వంటగది.. డైనింగ్‌హాల్, స్టోర్‌రూంలకు ఒక్కో గది.. పిల్లలు ఆటపాటలతో చదువుకునేందుకు హాల్ కేటాయించారు. అయితే అద్దెభవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయాన్ని కార్యదర్శి.. అంగన్‌వాడీ కేంద్ర భవనంలోని హాలులోకి మార్చారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- చించోలి(బి) గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం తనిఖీ



వివరాలు అడుగుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

సారంగపూర్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు ప్రైవేటుకు దీటుగా మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. మండలంలోని చించోలి(బి) గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఇంజక్షన్ గది, మందులు నిల్వలు, రోగులకు వైద్యం చేసే గదులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి స్థానికంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. రిజిస్టర్లు, మందుల వివరాలు తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో రోగుల తాకిడి పెరిగే అవకాశాలున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరిపడా మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్‌కు సూచించారు. ఆస్పత్రుల ఆవరణలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అవసరమైన మొక్కలు నాటడంతోపాటు వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, వైద్యశాఖ అధికారి సౌమ్య, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో వసతుల కల్పనకు కృషి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్: కేజీబీవీల్లో అన్ని వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని.. విద్యార్థినులు మంచిగా చదువుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ (జి) మండలకేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో సౌకర్యాలు, విద్యార్థుల చదువు, తరగతి గదులు, వంటశాల, స్టాక్‌రూం, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందిస్తూ పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థినులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటర్ కళాశాల భవనం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఈవో రామారావు, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఎంఈఓ సాయన్న, ఎంపీఓ తిరుపతిరెడ్డి, హౌసింగ్ ఏఈ తనూజ, పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్, ఎస్ఓ వీణ తదితరులు పాల్గొన్నారు.

'సరస్వతి కాల్వకు నీరు విడుదల చేయిస్తా'



శ్రీహరిరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సోన్: నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో మాట్లాడి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతి కాల్వకు నీటిని విడుదల చేయించేందుకు కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పేర్కొన్నారు. మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు మంగళవారం శ్రీహరిరావును నిర్మల్‌లోని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. కాల్వకు నీటిని విడుదల చేయకపోవడంతో వరినార్లు ముదిరిపోతున్నాయని రైతులు వాపోయారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, ట్రస్మా చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, అంబేకర్‌ప్రసాద్, పాపాయిగారి రాంరెడ్డి, గడ్డం స్వామి, అమృత్‌రాజ్, పెద్ద లక్ష్మణ్, లింగన్న, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

భయం వీడితే జయం మీదే



పాల్గొన్న వీసీ గోవర్ధన్, విద్యార్థులు

బాసర: పరీక్షలంటే భయపడొద్దని, అవగాహనతో పరీక్షలకు సన్నద్ధం కావాలని ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. అకడమిక్ సెక్షన్ ఆధ్వర్యంలో 'పరీక్షల భయం' అంశంపై పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'భయం వీడితే విజయం తథ్యమని' పేర్కొన్నారు. ప్రతీరోజు 'నేను తెలివైనవాడిని, ధైర్యవంతుడిని, ఈ రోజు నాకు మంచి జరుగుతుంది' అనే భావనతో ముందుకు సాగాలని సూచించారు. నేర్చుకోవాలనే కసి, మానసిక స్థైర్యం ఉంటే జీవితమే మారుతుందని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఒత్తిడి, ఆందోళన, భయాలను అధిగమించేందుకు సలహాలు అందించారు. మోడల్ పేపర్లు, పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ధ్యానం, రిలాక్సేషన్ పద్ధతులు, టైం మేనేజ్‌మెంట్ ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, అకడమిక్ డీన్ డాక్టర్ విఠల్, హెచ్‌వోడీ దేవరాజు, కౌన్సిలర్లు లక్ష్మి, వెంకటస్వామి, అరుంధతి, పీఆర్వో డాక్టర్ బి.విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్న కాంగ్రెస్'



మస్కాపూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

ఖానాపూర్: స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసేలా వ్యవహరిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ అన్నారు. మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రభారి బి.లక్ష్మినర్సయ్యతో కలిసి రితేష్ రాథోడ్ మాట్లాడారు. అంతకుముందు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఆకుల శ్రీనివాస్, పుప్పాల ఉపేందర్, పిట్టల భూమన్న, చిలుకూరి గిరి, స్వామి, పవన్, సురేశ్, పోతురాజు, శివ, రాజశేఖర్, సుధాకర్, మహేశ్, రమేశ్, నర్సయ్య ఉన్నారు.

సోన్: మండల కేంద్రంతోపాటు మాదాపూర్, పాక్‌పట్ల గ్రామాల్లో మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి ఆధ్వర్యంలో మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం 'ఇంటింటికీ బీజేపీ– ప్రతి గడపకు బూత్ అధ్యక్షుడు'అనే కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షులు గణేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంగా గంగామణి

నిర్మల్: నర్సాపూర్ (జి) మండల ఐకేపీ ఏపీఎంగా కె.గంగామణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏపీఎం సునంద సారంగాపూర్ మండలానికి బదిలీ కాగా సోన్ మండలంలో పని చేసే గంగామణి ఇక్కడకు వచ్చారు. గంగామణిని ఐకేపీ సిబ్బంది సన్మానించారు.